చుక్కలూ – చీకటీ

సినిమా చూసినంతసేపూ వరలక్ష్మికి కన్నీళ్లు కారుతూనే వున్నాయి. కథ మొదలౌతూనే ఆమె కథానాయికలో లీనమైపోయింది. కథానాయికా, నాయకుడూ ప్రేమించుకోవడమూ, విడిపోవడమూ, ఒకరి కొరకు ఒకరు బాధపడడమూ, వాళ్ళు కలుసుకోడానికి అనేక అంతరాయాలు కలగడమూ— ఇవన్నీ ఆమె సినిమా చూసినట్లుగాక, తనకు జరిగినట్లే అనుభవించింది. పక్క కుర్చీలో భర్త కూర్చున్న విషయం కూడా మరచిపోయి ఆమె ప్రేమా, వియోగమూ, విరహమూ అన్నీ అనుభవించింది. కథానాయకుడు భయంకరమైన ప్రమాదాలలోనూ, కథానాయిక అంతులేని దుఃఖసముద్రం లోనూ మునిగి వుండగా ఇంటర్వెల్ వచ్చింది. ఉట్టిపాటుగా వెలిగిన లైట్ల వెలుతురుకు వరలక్ష్మి తెప్పరిల్లి కండ్లు తుడుచుకుంటూ వుండగా రామారావు మెల్లగా పిలిచినాడు "లక్ష్మీ" అని. వరలక్ష్మి బరువుగా ముఖమెత్తి భర్త వైపు చూసింది. రామారావు చిరునవ్వు నవ్వుతూ "కథలో జరిగే విషయాలకు కన్నీళ్లు కారుస్తారా?" అన్నాడు లాలనగా. వరలక్ష్మి సిగ్గుతో జవాబు చెప్పలేక పోయింది.

"మరీ అంత పరవశమైతే యెట్లా? మూడుసార్లు పిలిచినా నీకు వినబడనే లేదు" అన్నాడు రామారావు.

వరలక్ష్మి సిగ్గుపడుతూనే "పిలిచినారా?" అని అడిగింది.

"ఒకసారి గాదు — మూడుసార్లు పిలిచినాను. నీ వీ లోకంలోనే లేవు. తెరమీద జరిగేదంతా నిజ మనుకున్నావా? అదంతా కల్పితమే కదూ — వట్టి కథ" అన్నాడు రామారావు.

వినీ విననట్లుగా వరలక్ష్మి ఊకొట్టి తల దించుకొంది.

రామారావు మళ్ళీ అన్నాడు "పోనీలే, నీకు సినిమా నచ్చిందన్న మాట — అంతే చాలు. నాకేమో వట్టి తలనొప్పి వ్యవహారంగా వుంది."

వరలక్ష్మి బదులు పలకలేదు. కొత్తగా కాపురానికి వచ్చిన భార్య పదిమందిలో మాట్లాడడానికి సిగ్గుపడడం సహజమే అనుకొని రామారావు కూడా మాట్లాడడం మానుకొన్నాడు.

ఇంత మంచి సినిమా భర్తకు నచ్చలేదని వరలక్ష్మికి ఆశ్చర్యం కలిగింది. లేక మగవాళ్ళందరికీ యింతేనేమో !.... ఐతే మరి యింత మంది మగవాళ్ళు సినిమా కెందుకు వచ్చినారు ?.... అది కాదు — ఈయన పెద్ద చదువు చదునుకున్నాడు — అందువలన సినిమాలు బాగుండవేమో ? ఐనా యింత మంచి సినిమా బాగుండకపోవడం విచిత్రమే ! పాపం — అంత అందమైన అమ్మాయికి అన్ని కష్టాలు వస్తే యెవరికైనా మనసు కరగకుండా వుంటుందా ? వరలక్ష్మి ఆలోచనలు క్రమంగా కథమీదికి పోయినాయి. ఇంతలో మళ్లీ సినిమా మొదలుకావడమూ, ఆమె అప్రయత్నంగా మళ్లీ కథానాయికలో ఐక్యం కావడమూ జరిగిపోయింది. కథానాయకుడు ప్రాణాపాయ స్థితిలో వుండగా ఆమె విపరీతంగా బాధపడింది. ఆ బాధ కథానాయకుని మీద సానుభూతి కాదు. బాధంతా కథానాయిక భవిష్యత్తును గురించే, కథానాయకుడు మరణిస్తే పాపం ఆ అమ్మాయి గతి యేమవుతుందీ అనే.

సినిమా ఐపోయి రామారావూ, వరలక్ష్మి యిల్లు చేరుకునేటప్పటికి పదిన్నర అయింది. రామారావు భోజనం చేసినాడు — కానీ వరలక్ష్మి ఆకలి కాలేదని అన్నమంతా వదిలిపెట్టి లేచింది.

రామారావు సిగరెట్ త్రాగుతూ ఈజీఛేర్‌లో కూర్చుని వరలక్ష్మి వైపే చూస్తున్నాడు. వరలక్ష్మి పట్టెమంచంమీద వెల్లకిల పండుకొని, కండ్లు తెరచుకొని మిద్దె కప్పు వైపు చూస్తూ వుంది. సిగరెట్టు పారవేసి "తల నొప్పిగా వుందా లక్ష్మీ ?" అన్నాడు అతను.

"ఊఁహూ" అన్నది వరలక్ష్మి.

"మరి యెందుకట్లున్నావ్ ?" అన్నాడు రామారావు, యింక కొంచెం ఆసక్తితో.

వరలక్ష్మి కదలకుండా, రెప్పవాల్చకుండా, నిమ్నోన్నతాలు లేని కంఠంతో, యేదో లోకం నుండి మాట్లాడినట్లు "నన్నొకసారి మా వూరికి పంపిస్తారా" అన్నది.

రామారావు కేమీ దిక్కు తెలియలేదు. కొత్తగా కాపురానికి వచ్చిన భార్యతో ఆ సాయంత్రం కులాసాగా సినిమా చూడా లనుకున్నాడే గానీ, పాపం సినిమా చూసిన వెంటనే వరలక్ష్మిలో యింత మార్పు—యీవిధమైన మార్పు – వస్తుందని అతను వూహించనేలేదు. ఆసినిమా ఐనా వరలక్ష్మికి సరదాగా కొంత కాలక్షేప మౌతుందనుకున్నాడే గానీ తన కోసమేమీ కాదు. ఇక యీ రాత్రంతా యిద్దరికీ ఒంటరితనమోనేమో ?

రామారావు ఆదుర్దాగా అడిగినాడు, "యేం లక్ష్మి, మనసు బాగా లేదా ?"

"రేపు ప్రొద్దున రైలుకు పంపించండి. మళ్ళీ మరునాడే వచ్చేస్తాను !"

ఆ సాయంత్రందాకా మామూలుగా వున్న మనిషికి యింతలోనే యేమైందా అని రామారావుకు ఆశ్చర్యం కలిగింది. కానీ, ఆశ్చర్యంకంటే అతని మనస్సులో విచారమే యెక్కువగా వుంది. వరలక్ష్మి వచ్చిన యీ ఐదారు రోజులలోనూ తన జీవితమంతా యిదే విధంగా హాయిగా వుంటుందనే విశ్వాసం అతనిలో క్రమంగా బలపడింది. పెండ్లి నాటికి అతనికి భార్యమీద ప్రేమ అనేదేమీ లేనిమాట నిజమే. కానీ, పెండ్లయిన పదిరోజులకే తనకింత పెద్ద వుద్యోగం వచ్చింది. అదంతా భార్య

అదృష్టమేనని కొంతమంది ఆడవాళ్లు అన్న మాటలు తాను సంపూర్ణంగా నమ్మకపోయినా, మొదటిసారిగా అతనికి ఆనాడే వరలక్ష్మిమీద యేదో అభిమానం ఆరంభమైంది. అప్పుడైనా వరలక్ష్మిని తాను యింతగా ప్రేమించగలనని అతను అనుకోలేదు. ఈ ఐదారు రోజులలోనూ ఆమె ప్రవర్తన అతన్ని సంపూర్ణంగా వశపరచుకొంది. యింత అన్యోన్యంగా వుండగల భార్య దొరికినందుకు తన్ను తానే అభినందించుకుంటూ, వరలక్ష్మిని మనసులో ఆరాధించడం మొదలు పెట్టినాడు. అందుకనే తనకు సినిమాలమీద యిష్టం లేకపోయినా, వరలక్ష్మి సంతోషిస్తుందని ఆమెను సినిమాకు పిల్చుకపోయినాడు. కానీ, యిదేమిటి? పిడుగుపాటుగా వూరికి పంపించమని పట్టుపట్టింది!

"యెందుకు లక్ష్మీ? నీవు వచ్చి యింకా వారమైనా కాలేదే?" అన్నాడు రామారావు దిగులుగా.

వరలక్ష్మి మెల్లగా చెప్పింది "లేకపోతే మీరూ రండి. యిద్దరమూ కలిసి రేపు రాత్రికే తిరిగి రావచ్చు."

రామారావుకు కొంచెంగా విసుగు కలిగింది. ఈజీఛేర్‌లో నుంచి లేచి చిరాకుగా మంచం దగ్గరికి వచ్చినాడు. కానీ, వరలక్ష్మి ముఖం చూసేటప్పటికి అతని విసుగూ, చిరాకూ మాయమైనాయి. యేదో గంభీరమైన వేదన — ప్రశాంతమైన దుఃఖం — నీరవమైన బాధ — ఆమె ముఖం మీద బరువుగా కూర్చొని వుంది. అతని హృదయం జాలితో, ప్రేమతో, దయతో, అనురాగంతో నిండిపోయింది. తన వరలక్ష్మికి యింత కష్ట మెందుకు వచ్చిందో? మంచంమీద కూర్చొని బుజ్జగిస్తూ అన్నాడు అతను: "సరేలే లక్ష్మీ — ప్రొద్దున్నే పోదాంలే. యింతకూ అసలు సంగతేమిటో చెప్పవూ?"

"మీరేమీ అనుకోరు గదూ ?" భర్త వైపు చూడకుండానే అడిగింది ఆమె.

"ఛీ — నీవే నన్ను నమ్మకపోతే యెట్లా ? — చెప్పు."

మొదటిసారిగా ఆమె భర్త వైపు తిరిగి బరువుగా చెప్పింది: "మా బావ నొకసారి చూసి వస్తాను."

"అంత మాత్రానికేనా యింత దిగులు !" అని తేలికగా నవ్వినాడు రామారావు. అంతలోనే బావ అన్న మాట మెదడు కెక్కి మనిషి నిలువునా స్తంభించి పోయినాడు. ఒక నిమిషం అతనికి నోట మాట రాలేదు. తర్వాత మెల్లగా "యెవరు లక్ష్మీ ?" అన్నాడు.

"మా బావ — మా సూర్యం బావ." వరలక్ష్మి ఆశగా చూసింది భర్త వైపు.

రామారావు బరువుగా మంచంమీద నుండి లేచిపోయి కిటికీ దగ్గర నిలబడినాడు — బయటి చీకటిని చూస్తూ. వరలక్ష్మికి తనమీద ప్రేమ లేదా ? యింతకుముందే వాళ్ళ బావను ప్రేమించిందా ? మరి యీ వారం రోజులూ తన్ను ప్రేమించినట్లే కనబడిందే ? రామారావు చాలాసేపు మౌనంగా, చీకటిని చూస్తూ, ఆలోచనలు లేని విచారంలో మునిగి పోయినాడు. తరువాత వరలక్ష్మి వైపు తిరిగి అన్నాడు : "మీ బావను పెండ్లి చేసుకుందా మనుకున్నావా ?"

వరలక్ష్మి పసిపిల్ల మాదిరి తల ఆడించింది ఔనన్నట్లు. అమాయక మైన ఆమె ముఖం, అలౌకికమైన ఆమె కన్నుల్లోని కాంతి, పసిపిల్లవలె ఆ జవాబు చెప్పే పద్ధతి — రామారావుకు కోపగించుకోడానికి యెక్కడా కారణమే కనబడలేదు. హృదయంలో యేమూలనో అసూయ తల యెత్తింది. కానీ, ఆ అసూయను ప్రకటించే దెట్లనో అతనికి తోచలేదు.

ఆ బావ యెవరో తనకు తెలియదు. తనతో వరలక్ష్మి స్వయంగా చెప్పక పోతే బహుశా యెన్నాళ్లున్నా తనకు తెలియకపోవునేమో. మెల్లగా అడుగులు వేసుకుంటూ అతను మళ్ళీ మంచం దగ్గరికి వచ్చినాడు. నిశ్చలంగా వున్న వరలక్ష్మి కన్నుల్లోకి చూస్తూ అడిగినాడు: "మీ బావ నెందుకు చేసుకోలేదు ? మీ నాన్న వొప్పుకోలేదా ?"

వరలక్ష్మి మళ్ళీ తల ఆడించింది ఔనన్నట్లు.

"యెందుకు వొప్పుకోలేదు ?" రామారావు ప్రశ్నించినాడు.

వరలక్ష్మి నిశ్చలంగా భర్త వైపు చూస్తూ చెప్పింది "మా బావ...." ఆ మాటతో ఆమె కడుపులోని దుఃఖమంతా కట్టలు త్రెంచుకొని బయటికి వచ్చింది. గద్గద కంఠంతో, కన్నీటి చుక్కలతో, వాక్యం పూర్తి చేసింది. "మా బావకు — మీయంత డబ్బు లేదు; మీయంత — చదువూ లేదు."

రామారావు మెల్లగా వెనకకు తిరిగి మళ్ళీ కిటికీ దగ్గరికి పోయి నిలబడినాడు — బయటి చీకటిని చూస్తూ. ఒక నిమిషం ఐన తర్వాత చీకట్లోకి చూస్తూ అడిగినాడు : "మరి నన్నెందుకు చేసుకున్నావ్ ?"

కంఠం సవరించుకుంటూ వరలక్ష్మి జవాబు చెప్పింది. "మీకు డబ్బూ, వుద్యోగమూ వున్నాయిగా ?"

రామారావు చీకటి లోకాన్ని చూస్తూనే వున్నాడు. అనంతమైన ఆకాశం — అనంతకోటి నక్షత్రాలు — అన్నిటినీ ఆవరించిన అనంతమైన అంధకారం.

(ఏప్రిల్ 1958)